# జీవన నిర్ఝరి

ఎ. సర్వేశ్వరరావు

**జీవితంలో ఒక్కసారయినా కంట తడిపెట్టని ప్రాణి కానరాదు సానుభూతితో తపించి, కన్నీరు తుడవడం మనసున్న ఎవరికైనా సాధ్యమే దానికి కారణమైన వేదన అర్థం చేసుకొని తొలగించడం మాత్రం అందరికీ అసాధ్యం.**

“**అమల** విషయంలో నాకేం నమ్మకంలేదు” అంది చంచల.

జవాబుగా అత నేం మాట్లాడలేదు. సిగరెట్ వెలిగించుకోడంలో నిమగ్నుడైపోయాడు.

“అనవసరంగా డబ్బు వృథా చేయడం తప్ప దేనికీ ప్రయాస?” అంది మళ్ళీ.

“అవును.”

“వాళ్ళకేం? లక్షాధికారులు! ఎంత తగలెట్టినా తరిగిపోతుందనే చింత లేనివాళ్ళు.”

“అవును.”

“ఇందులో సగం శ్రమ ఆనాడు మృణాళిని విషయంలో పడిఉంటే అంత దారుణం జరిగేదే కాదు. ఎందుకు పడతారు? హ్యుం. ఒక్కొక్కరిపట్ల అలా ఉంటుంటాయి శ్రద్ధాసక్తులు.”

“అవును.”

పొడి పొడి జవాబులు ఆమెకు నచ్చలేదు. అందుకే అతని ముఖంలోకి చూసి, “ఏమి టాలోచిస్తున్నారు?” అనడిగింది.

“ఏంలేదు” అని తల ఊపేడు, సైకియాట్రిక్ వార్డు వరండాలోకి మలుపు తిరుగుతూ.

“రోగాన్నీ, మృత్యువుని తరిమికొట్టగలిగే శక్తి ఈ సంపదకే ఉంటే ప్రపంచంలో ఇన్ని వేదనలకూ, రోదనలకూ తావే ఉండకపోను.”

“అవును.” ఆమె నిట్టూర్పు విడిచింది. “మానవుడు ఎంత గొప్పవాడైనా, శక్తిమంతుడైనా, మృత్యువుకు మాత్రం భయపడక తప్పడం లేదు. ఎంతటి శక్తి, ఎంత నిగ్రహం అలవరుచుకున్నా ఆ ఘడియలో ఆ అనుభూతికి లోనుగాక తప్పదు.” వరండా మెట్లు దిగి యార్డులో అడుగెట్టారు.

“శేఖర్‌బాబూ!” తులుక్కుపడి ఆగిపోయాడు అతను.

“ఎవరో పిలిచినట్టున్నారు” అన్నాడు వెనక్కు చూసి. పిలుపు మళ్ళీ వినిపించింది వరండా అవతలినుండి. కాని ఎవరూ కనిపించకపోగా, “ఉహుం. మిమ్మలైన్న ఉండదు. అయినా మిమ్మల్నెవరు పిలుస్తారిక్కడ? పదండి” అని ముందుకు నడిచింది చంచల. కాని అతను కదలలేదు.

“ఉహుం. ఆ స్వరం ఎక్కడో విన్నట్టుగా ఉంది, చంచలా!” అని వెనక్కుతిరిగి మెట్లెక్కపోగేడు. పిలుపు మరీ సమీపంలో మళ్ళీ ధ్వనించింది. శేఖర్ అటు ఇటు చూశాడు.

ఒక వ్యక్తి గదిలోంచి పరుగెడుతూ వస్తూ, వరండాలోంచి అటే మలుపు తిరగబోతున్న తోటిని ఢీకొని అమాంతం నేల పడిపోయింది.

“రేవతి!” నిర్విణ్ణుడయ్యాడు శేఖర్. మరు నిమిషం, “రేవతీ!” అని అరిచి అక్కడికి పరుగు తీశాడు.

తోటి గాభరాగా, “సిస్టర్! సిస్టర్!” అని కేక వేశాడు. క్రిందపడ్డ వ్యక్తినిచేరి ఆత్రుతగా ఆమె తలపట్టి పైకెత్తి, “రేవతీ!” అని పిలిచాడు శేఖర్. కాని ఆమెలో చలనం లేదు.

“అబ్బబ్బ! ఏమైంది మళ్ళీ?” నర్సు వచ్చింది. చూసింది.

“ఓహ్! ఈవిడా! ఎంత చెప్పినా అలా పరుగెత్తడం మానదు. ఎంతకని కనిపెట్టుక్కూర్చోవడం!” విసుక్కొంటున్న నర్సు ముఖంలోకి అర్థాంతరంగా చూసి, “చూడండి, సిస్టర్! ఈమె స్పృహ కోల్పోయింది” అన్నాడు శేఖర్.

“ఇదేం క్రొత్త కాదు. మామూలే” అని “కొంచెం సాయం పట్టు, జాకొబ్!” అని తోటి నుద్దేశించి అంది. ఇద్దరూ పట్టి గదిలోకి తీసుకువెళ్ళి ఆమెను బెడ్‌పైకి చేర్చారు.

“ఎవరండీ ఈమె?” చంచల అడిగింది.

“తర్వాత చెప్తా” అని, నర్సుతో, “చూడండి సిస్టర్! డాక్టర్ని పిలుస్తే బాగుంటుంది” అన్నాడు. నర్సు ముఖం చిట్లించింది.

“వా రిప్పుడు వార్డులో లేరు. మరేం ఫర్వాలేదు. రెండు నిమిషాల్లో అదే సర్దుకుంటుంది” అంది, నీటిలో తడిపిన దూదితో ఆమె ముఖంపై వత్తుతూ. శేఖర్ వదనం అసంతృప్తితో, అసహనంతో ఎర్రబారింది. “సిస్టర్! మీ నిర్లక్ష్యానికి నేను చాల చింతిస్తున్నాను. నర్సుగా మీలో ఉండవలసిన లక్షణా లేం కావివి. ఈ పేషెంటు మీకు క్రొత్త కాకపోవచ్చు. కాని నాకూ క్రొత్త కాదు. ఈ వ్యక్తి నన్ను చూసింది. నాకోసమే అలా పిలుస్తూ పరుగెత్తుకువచ్చింది. ఆ గాభరాలో అతన్ని గుద్దుకుని ఈ స్థితికి లోనయింది....”

నర్సు అతనికేసి కోపంగా చూసింది.

“అవును. ఎంత ఓపికగా ఉన్నా మేమెప్పుడూ చెడ్డవాళ్ళమే” అంది.

“మంచి చెడు నేను చెప్పడం లేదు, సిస్టర్! కాని మీ డ్యూటీకి ఇంత కోపం, నిర్లక్ష్యం పనికిరాదు. వెళ్ళండి. డాక్టరును పిలుచుకురండి. లేదా నేనే వెళ్ళి పిలుచుకువస్తాను, మీకేం అభ్యంతరం లేకుంటే” అని శేఖర్ కదలబోయాడు. విస విసా వెళ్ళిపోయింది నర్సు, మాటాడకుండా.

“పాపం! వీళ్ళుమటుకు ఏం చేయగలరు? వీళ్ళ పరిస్థితే అంత” అంది చంచల సానుభూతిగా.

“కావచ్చు” అని వాచీ చూసుకుని, “ఆలవుతోంది, చంచలా! నువ్వెళ్ళరాదూ? మహేశ్‌తో చెప్పు, నేను రాలేకపోయానని” అన్నాడు.

“బాగుంది. మీరు రాకుండా నేను వెళ్ళడం ఏమిటి?”

“ఉహుం. ఇద్దరూ వెళ్ళకపోతే అత నేమన్నా అనుకుంటాడు.”

“మరేం ఫర్వాలేదు” అంది చంచల, రోగి వంక చూస్తూ. హౌస్ సర్జను వచ్చాడు. పేషెంటును చూశాడు. ఇంజక్షనిచ్చాడు. ఇంకా ఏవేవో చేస్తున్నాడు.

“ఎంతసేపట్లో తెలివి వస్తుంది?” అడిగాడు శేఖర్.

“గంటా రెండు గంటల్లో రావచ్చు” అని, “మీ రెవరో తెలుసుకోవచ్చా?” అన్నాడు తను. జేబులోంచి ఓ కార్డు తీసిఇచ్చాడు, శేఖర్. చదువుకున్నాడు అతను. కలవరపడుతూ, శేఖర్ ముఖంలోకి చూసి, “శేఖర్ అంటే మీరే నన్నమాట! ప్చ్! పేషెంటు నిక్కడ జాయిన్ చేసినప్పుడే, మీ రిక్కడే ఉన్నట్టు మాకు తెలిస్తే ఎంత బాగుండేది!” అన్నాడు.

“ఎన్నాళ్ళయింది ఈమె నిక్కడ జాయిన్ చేసి?”

“రెండు నెలలవుతోంది.”

“ఎవరు జాయిన్ చేశారు?”

“సేవాసదనంవాళ్ళు తీసుకువచ్చి చేర్చారు. ఏదో తీర్థంలో అల్లరి మూకచేత బాగా దెబ్బలు తిని స్పృహ గోల్పోయిన పరిస్థితిలో వాళ్ళు చూసి తీసుకువచ్చారు.”

నిట్టూర్పు విడిచాడు శేఖర్.

“మొదటినుండి ఈ పేషెంటు మమ్మల్ని చాల తికమక పెట్టేస్తోంది. అందరిలా కేకలు, అల్లరి ఇవేం లేవు. కాని ఏవేవో అడుగుతుంది. ఉండుండి ఎందుకో ఏడుస్తుంది. అంతలోనే ఆలోచనలోపడి నవ్వుకుంటుంది. ఇక ఒకొకప్పుడు ఎవర్నో పిలుస్తూ ఎటో పరుగెడుతుండేది. మళ్ళీ వెంటనే తిరిగివచ్చి మంచంపై

పడిపోయేది. కాని మొన్నొకసారి గేటువరకు పారిపోయింది. గూర్ఖా అడ్డగించాడట. అమాంతం వాడిచేతిలోని కర్రను లాక్కుని వాడి తలపై మోది, తనుకూ కొట్టుకుని విరుచుకు పడిపోయింది.''

గంట గడిచిపోయింది. మరో గంటా గడిచి పోయింది. కాని రోగిలో చలనంలేదు. హౌస్ సర్జన్ ఏవేవో చేస్తున్నాడు. కాని రోగికి స్పృహ రావడంలేదు. ఇక లాభంలేదని డాక్టరును పిలువ డానికి వెళ్ళిపోయాడు. శేఖర్ వరండాలోకి వచ్చాడు.

''నే నలా వెళ్ళివస్తాను. నువ్విక్కడే ఉండు'' అని వెళ్ళిపోయాడు. శేఖర్ తిరిగి వచ్చేసరికి చంచల వరండాలోనే పచార్లు చేస్తూ ఉంది.

''ఏమైంది?'' అడిగాడు.

''డాక్టరుగారు వచ్చారు. పేషెంటును థియేటరులోకి తీసుకువెళ్ళారు. స్పృహ వచ్చినతర్వాత మనకి కబురు చేస్తానన్నారు. ఇక్కడే వెయిట్ చేయమన్నారు'' అంది.

''సరే!'' అక్కడున్న ఓ బెంచీమీద కూర్చు న్నాడు శేఖర్. ఆలోచనలతో, ఆందోళనతో అతని వదనం మలినమైపోతూంది.

నర్సు వచ్చింది. ''డాక్టరు పిలుస్తున్నారు--రండి'' అంది. లోపలికి నడిచారు. డాక్టరు ఓ స్ఫింక్స్‌ను అనుకుని నిలుచుని శూన్యంలోకి విషాదంగా చూస్తున్నాడు.

''డాక్టర్!'' శేఖర్ మాటతో డాక్టరు ఇటు తిరిగి చూశాడు. తల పంకించి, ''మిస్టర్ శేఖర్! మీరు చాల ఆలస్యంగా వచ్చారు. ఇన్నాళ్ళా నిలువ గలిగిందీ అంటే అది కేవలం విధి నిర్ణయం మాత్రమే'' అన్నాడు. శేఖర్ బెడ్ దగ్గరికి నడి చాడు. రేవతి కళ్ళు తెరిచి చూస్తూంది. ఆ చూపుల్లో ఏ అనుభూతీ లేదు. నిర్లిప్తంగా నిర్జీవంగా ఉన్నాయి. ''డాక్టర్! పరిస్థితి అంత విషమించిందా? ఇక మీరేం చేయలేరా?'' అన్నాడు రుద్ధస్వరంతో. డాక్టరు తల ఊపి అటు తిరిగిపోయాడు. రేవతి కళ్ళల్లోకి చూశాడు శేఖర్. అకస్మాత్తుగా ఆ చూపుల్లో ఆశ వికసించింది. పెదవులూ విడివడినాయి. మాట వెలువడలేదు. కాని సంకేతాన్ని గ్రహించాడు శేఖర్. అనంతమైన అశ్రు స్రవంతి నదుపులో పెట్టడం ఇక తనకుమించిన పనే అయిపోయింది. ముఖం పక్కకు తిప్పేశాడు. మరునిమిషం కెవ్వు మంది చంచల. ఉలిక్కిపడ్డాడు శేఖర్.

''రేవతీ!'' శేఖర్ లేచి గిర్రున వెనక్కు తిరి గాడు.

''చంచలా!'' పిలిచాడు. పరుగున వచ్చింది.

''పోదాం, పద.'' అతని స్థితి చూసి భయమే చెందింది. అతని చేయి పట్టుకుని గబగబ నడి చింది. గేటు దాటారు. రిక్షా పిలిచింది. కూర్చు న్నారు. రివ్వున సాగిపోయింది. ఇంటిముందు ఆగింది. దిగి లోపలికి నడిచారు. కోటు విప్పి స్టాండుమీదికి విసిరేశాడు. తల పట్టుకుని కుర్చీలో కూర్చుండిపోయాడు.

''ఆమె ఎవరు? ఏమి టిదంతా?'' అడిగింది



వ్యాకులపడుతూ. కుర్చీలోంచిలేచాడు., "క్షమించు చంచలా! నే నిప్పు డేం చెప్పలేను. కాని ఎప్పుడో ఒకనాడు తప్పకుండా చెబుతాను. నువ్వడగ కుండానే చెబుతాను" అని గబాలున తన గదిలోకి వెళ్ళిపోయాడు.

*  *  *  *

ఇంట్లోంచి సైకిలు తీసుకువచ్చి గుమ్మం ముందు పెట్టాడు శేఖర్. స్టాండువేసి లోపలికి వెళ్ళి టెన్నిస్‌బాట్‌తో తిరిగివచ్చాడు. సైకిలు ఎక్కబోతున్నాడు.

"వర్షం వచ్చేలా ఉందే?" చంచల వచ్చి, అరుగుమీద నిలుచుని ఆకాశంలోకి చూస్తూ అంది.

"అవును" అన్నాడు తనూ పైకి చూసి.

"ఆపాటిదానికి వెళ్ళకపోతే నేం?" ఆమె మాట వినిపించుకోలేదు అతను. సైకి లెక్కి రివ్వున సాగిపోయాడు. నిట్టూర్పు విడిచి గగనం లోకి చూస్తూ అక్కడే ఉండిపోయిందిచంచల.

చూస్తూండగనే మేఘాలు దట్టంగా కమ్ము కుని చిన్న చిన్న చినుకుల్ని రాల్చసాగినాయి. కాస్సేపట్లో అవి పెద్దవై విజృంభించ సాగి వాయి.

"అరె! బట్టలుపై నే ఉండిపోయినాయి" అని గబగబ లోపలికి పరుగులీసింది. పెరట్లోకి వెళ్ళి ఆ పని పూర్తిచేసి నడవలోకి వచ్చింది. వీధి తలుపు దబాలున తోసుకుని లోపలకు జొర బడింది సైకిలు.

"తడిసిపోయారా?"

సైకిలు ఒక పక్కగా స్టాండువేసి గదిలోకి వడిచాడు శేఖర్.

"తడుస్తూ రాకపోతేనేం? వెలిసేదాకా ఎక్క డన్నా నిలబడకపోయారా" అంది.

బట్టలు విప్పి బల్లమీద పడేశాడు. పైజామా, షర్టు తొడుక్కుని కుర్చీలో కూర్చున్నాడు. తడి బట్టలు తీసుకుని లోపలికి వెళ్ళిపోయింది చంచల. రెండు నిమిషాల్లో తిరిగివచ్చింది. అడిగింది— "టీ కావాలా?" అని.

"ఊఁ." ఫ్లాస్కుతీసి గ్లాసులో పోసిఇచ్చింది. తనూ ఓ కప్పు నింపుకుంది. టీ తాగి సిగరెట్ ముట్టించాడు. దినపత్రిక, వారపత్రికలు తీసుకు వచ్చి అతని పక్క కుర్చీలో పడేసి తనొకటి తీసుకుని కుర్చీలో కూర్చుంది.

పేపరు తీసుకున్నాడు శేఖర్.

"శోభ, మహేశ్ వచ్చారు మధ్యాహ్నం" అంది.

"దేనికి?" పేపరు చదువుతూనే అడిగాడు.

"రేపు వాళ్ళ రెండో అబ్బాయి పుట్టిన రోజట. చెప్పడానికి వచ్చారు."

"రెండో అబ్బాయికా? అయితే ఆమధ్యన అయింది పెద్దవాడి దన్నమాట?"

"ఊఁ ఆ రోజు వెళ్ళలేకపోయాం మనం. రేపైనా తప్పక రావాలని మరీ మరీ చెప్పారు."

"ఆ రోజు ఎక్కడికి వెళ్ళాం మనం?"

## జీవన నిర్ఝరి

సాలోచనగా శూన్యంలోకి చూస్తూ అన్నాడు.

"ఆ రోజు హాస్పిటలులో ఉండిపోయాం. ఆమె...."

"రేవతి!" చేతిలోంచి పేపరు జారిపడి పోయింది. ముఖం వివర్ణమైపోయింది.

"రేవతి పోయి అప్పుడే రెండు నెలలవుతోంది. కాలం ఎంత వేగంగా పరుగెడుతోంది!" నిట్టూర్పు విడిచాడు.

"చంచలా! ఎవరీ రేవతి? ఎక్కడి రేవతి ఎక్క డికి వచ్చింది? ఎవరికై ఇన్నాళ్ళూ ఉన్మాదంలో పరితపించిపోయింది? చివరికి ఎవరికి తుది ఘడి యలు మిగిల్చి వెళ్ళిపోయింది?" తల భారంగా పట్టుకున్నాడు. చంచల మాట్లాడలేదు. విచార గ్రస్తమైన పతి ముఖంలోకి చూస్తూ ఉండి పోయింది.

"చంచలా! ఇప్పుడు నీకేం పని లేదుకదూ?" అడిగాడు.

"ఉహూఁ!"

"రేవతి కథ చెబుతాను, వింటావా?" తల పంకించింది చంచల.

"ఎప్పటికప్పుడు నేనే అడుగుదామనుకుంటు న్నాను. కాని ఆ రోజు మీ రలా చెప్పారనే అడగలేక పోయాను. చెప్పండి" అంది. అయిపోయిన సిగరెట్‌ను ఏష్ ట్రేలో పడేసి మరొకటి వెలి

### విరహార్తి

చిత్రం—ఎస్. వి. రామంచయ్య
(బెంగుళూరు-13)



గించాడు. వర్షం ఎక్కువైంది. కిటికీలోంచి జల్లు కొట్టసాగింది. లేచి వెళ్ళి కిటికీ తలుపులు వేసి వచ్చి కూర్చుంది. అతను చెప్పసాగేడు.

"జీవితంలో ఎన్నో సంఘటనలు జరుగు తుంటాయి, చంచలా! ఒకదానికీ, మరొకదానికీ సంబంధమేమీ ఉండదు. వేటి కవే వాటి స్మృతులు మనల్ని చుట్టుముట్టి మురిపిస్తూనో, బాధిస్తూనో ఉంటాయి. కాని ఊహించని రీతిగా వాటి మధ్యనో సంబంధమే సంభవించిననాడు, తట్టుకోలేని విధంగా మనపై దెబ్బ తీస్తుం టాయి. అప్పుడే మనిషి పిరికివాడయిపోతాడు; పిచ్చివాడయిపోతాడు. లేదా ఉన్నతుడే అయి పోవచ్చు. కాని ఆ స్థితికి తట్టుకోగలిగిననాడు ఇక ఏ స్మృతులూ, గతులూ అతన్ని పొంగించలేవు; క్రుంగించలేవు. అయితే బ్రతుకు నిర్లిప్తమై పోతుంది. ఏ అనుభూతీ దాన్నిక కదిలించలేదు.

ఫిఫ్టీనైన్‌లో నేను విజయనగరంలో ఉంటుండేవాడిని. ఇదే డిపార్టుమెంటులో అకౌం టెంటుగా పని చేస్తుండేవాడిని. కృష్ణమూర్తి అని ఓ టీచరుతో కలిసి ఒక గదిలో ఉంటుండే వాడ్ని. కృష్ణమూర్తి నాకేం కాడు. స్నేహితుడూ కాడు. ఒకే గదిలో కలిసి ఉండేవాళ్ళం. అతను ఇంట్లోనే వండుకునేవాడు. నాది హోటలు భోజనం. అంతే.

కృష్ణమూర్తి అప్పుడు ఏదో పనిమీద బరం పురం వెళ్ళాడు. ఆ రోజే తిరిగివస్తాడు. ఆ సంగతి నాకు తెలుసు. కాని రావడం తిన్నగా మా ఆఫీసుకే వచ్చాడు. ఎప్పుడు ఏ ఊరికి వెళ్ళినా నాతో చెప్పే వెళ్ళేవాడు. మళ్ళీ ఎప్పుడు తిరిగి వచ్చేదీ చెబుతుండేవాడు. గదిలోనే కలుసు కునేవాళ్ళం. అలా ఆఫీసుకు ఎప్పుడూ రాలేదు. అందుకనే కాస్త విస్మయపడక తప్ప లేదు.

"కొంచెం మాట్లాడాలి. పైకిరం"డన్నాడు. పైకి వచ్చాను. కాంటీనులో కూర్చున్నాం.

"నే నిప్పుడో చిక్కులో పడ్డాను" అన్నాడు. ఏం కావాలో అడగవచ్చిన సర్వరుకు చెప్పవలసింది చెప్పిపంపించి, "ఏమిటది" అన్నాను.

"ఒక అమ్మాయి నావెంట పడింది" అన్నాడు.

"అమ్మాయి!" ఆశ్చర్యంగా చూశాను.

"అవును. నాతో తీసుకురాక తప్పింది కాదు."

"ఎక్కడుంది ఇప్పుడు?"

"రూమ్‌లో విడిచిపెట్టి వచ్చాను."

"అసలు పరిచయ మెక్కడ?" కుతూహలంగా అడిగాను.

"పరిచయం లేదూ, పాడూలేదూ. జరిగిన సంగతే వేరు. ఎలా చెప్పాలో నాకే అర్థం గావటం లేదు" అని నిట్టూర్చి చెప్పసాగేడు.

ఆమదాలవలసలో ఆమె బండి ఎక్కింది. కంపార్టుమెంటు ఖాళీగానే ఉంది. కాని ఆమె ఎక్కడా కూర్చోలేదు. తలుపుదగ్గర చతికిల బడిపోయింది. మనిషి చాలా హీనంగా ఉంది. అలాగని ఏ భిక్షుకిగానో ఊహించడానికీ వీలులేదు. అలాంటి ఛాయ లేవీ ఆమెలో లేవు. ఎంత నీరస

సించినా, కళాకాంతులు క్షీణించినా, ఒకప్పటి ఉన్నతకులీనత, సంస్కారం ఆమెలో కనిపిస్తూనే ఉన్నాయి శిలగా. అందరూ ఆమెను చూశారు. నేనూ చూశాను. ఆమె కూడ అందర్నీ చూసింది. నన్నూ చూసింది కాని, అమాంతం లేచి నాదగ్గరికి పరిగెత్తుకువచ్చింది. దుఃఖప్రవంతి వెల్లువై పొంగింది.

'ఆనంద్! ఎన్నాళ్ళకు కనిపించావు, ఆనంద్!' అంటూ అమాంతంగా కాళ్ళను చుట్టేసి భోరున ఏడ్వసాగింది. బిత్తరపోయాను. అంతా ఆశ్చర్యపోయారు. కథేమిటని అడిగారు. ఏమని చెప్పేది? అసలంటూ ఉంటే గదా! ఆమె ఎవరో నాకు తెలియదు. ఏవిషయం కాదుకదా, గతంలో ఎక్కడా ఎప్పుడూ అలాటి వ్యక్తినే నేను చూసి ఉండలేదు. అయినా ఆమె పిలిచిన పేరు కూడ నాది కాదు. కాని ఆమె నన్ను విడువలేదు.

'నన్ను నాశనం చేయకు; నాశనం చేయకు!' ఒకటే రోదన. ఒకటే నివేదన. ఏం చేయాలప్పుడు? నలుగురూ నాలుగు విధాల అన్నారు. పిచ్చి, నటన. కాని ఆ రెండూ ఆమెనుబట్టి నేను ఉపేక్షించలేకపోయాను. పక్క స్టేషన్‌లో పోలీసులను పిలిచి అప్పగించమన్నారు. ఇంకా ఏవేవో చేయమన్నారు. కాని ఆ మాటలన్నీ విన్న ఆమెలో దుఃఖం, అలజడి మరింత ఎక్కువ కాసాగినాయి. బదిలింపుతో, బెదిరింపుతో పరిష్కరించగల సమస్యగా నా కవి కనిపించలేదు. వాళ్ళూ వీళ్ళూ చెప్పినట్టు ఆమెను పోలీసుల కప్పగించడానికి నా మనసు అంగీకరించలేదు. అనూహ్యంగా ఒక భ్రమ ఆమె నావరించింది. కాస్త వ్యవధి ఇస్తే కోలుకోవచ్చు అనుకున్నాను. ఏడవ వద్దన్నాను. పోలీసుల కప్పగించడంగాని, మరే హింసాగాని జరగదని హామీ ఇచ్చాను. ఏడ్పు ఆగిపోయింది. అలాగని సంతోషమూ లేదు. నిర్లిప్తంగా బెంచీమీద కూర్చుంది.

ఇక ఊహాగానాలు బయలుదేరినాయి. నా తత్త్వం వాళ్ళర్థం చేసుకోలేరు. నా ఉద్దేశం వాళ్ళు గ్రహించలేరు. కాని ఊహిస్తున్నారు. వాళ్ళకు చేతనయిందల్లా అదే. బండి విజయవాడ చేరింది. ఆమెను మళ్ళీ అడిగాను. 'మీరెవరో నాకు తెలియదు. నిజం చెబుతున్నాను. అసలు ఇదే తొలిసారి మిమ్మల్ని చూడటం. రెండవది నా పేరు ఆనంద్ కాదు. కృష్ణమూర్తి' అని చెప్పాను."

"ఆనంద్!" నా మనసులో ఎక్కడో ఏదో కదిలినట్లయింది.

"ఆఁ ఏం?" కాఫీలు వచ్చినాయి. తీసుకున్నాం.

"ఏం లేదు. చెప్పండి."

"చెప్పాను. చాల చెప్పాను. ఎక్కడికి వెళ్ళాలో, మీ వారెవరో, జరిగిందేమిటో అడిగాను. కాని దేనికీ జవాబు లేదు, ఏడుపు మినహా. ఇక విసుగెత్తింది. పోలీసుల కప్పగించి నా బాధ్యత తీర్చుకోక తప్పదని బెదిరించాను.

'పోలీసుల కప్పగిస్తావా నన్ను? దానితో నీ బాధ్యత తీరిపోతుందా? అంతకన్న మీ కళ్ళముందే నన్ను నేను మృత్యు కప్పగించి నీ బాధ్యత తీరుస్తాను' అని ఏడుస్తూ నా బూట్లుకేసి తల బాదుకో సాగింది.

"భగవాన్! ఇక ఏం చేయాలి? అడుగడుగునా చెబుతూనే ఉన్నాను. అయినా లాభం లేకపోయింది. నా సంగతి మీకు తెలుసు. పిరికివాణ్ణి. ఏపాటి దీనత్వాన్ని చూసినా నా హృదయం ద్రవించిపోతుంది. అలాగని ఏమీ చేయలేను, అన్నీ తెచ్చి నెత్తిమీద పెట్టుకుని క్రుంగిపోవడం తప్ప. చెప్పండి, ఏం చేయాలి?"

ఆలోచనలో పడ్డాను.

"నేను చేసిన పనిని ఎవరూ హర్షించకపోగా పిచ్చి వెధవకింద జమకడతారు. కాని మీ దృక్పథం నాకు తెలుసు. చెప్పండి."

"అది నటన కాదు."

"కాదు."

"పిచ్చి కాదు."

"కాదు."

"పిచ్చిలో చాల రకాలున్నాయి. ఒకర్ని చూసి మరొకరిని భ్రమించే మనస్తత్వమూ ఆ కోవకే చెందుతుంది."

"కావచ్చు. కాని—"

"ఇప్పుడు మీరేం చేయగలరు? ఆదరించక తప్పింది కాదు. ఆదరించారు. హామీ ఇవ్వక తప్పింది కాదు. ఇచ్చారు. తీసుకురాక తప్పింది కాదు. తీసుకువచ్చారు."

"అందుకే మిమ్మల్ని సలహా అడుగుతున్నాను. చెప్పండి." ఆత్రుతగా అడిగాడు.

"పెళ్ళి చేసుకోండి."

అదిరిపడ్డాడు. "పెళ్ళి!"

"ఏం?" నా సలహాలో పరిహాసంలేదు. ఆలోచించే అన్నాను. కాని అంత మనిషీ ఒక్కసారి అవమానంతో కుంచించుకుపోయి, "మీ రిలాటి సలహా ఇస్తారని నే ననుకోలేదు. బాగా ఆలోచించండి. ఇంటికి వెళదాం పదండి. మిమ్మల్ని చూసేనా కాస్త అదుపులోకి రావచ్చు—మీకు భయపడి" అంటున్నాడు.

నవ్వాను. "అది అసంభవం. ఎవరు బెదిరించినా, శరణు కోరడానికి మీ రున్నారన్న విశ్వాసం ఆమెలో ప్రగాఢంగా లేకుండా ఉంటే ఇంతవరకు వచ్చేదే కాదు" అన్నాను.

"పరిస్థితి నిజమే అయితే మీ రన్నదానికి నే నంగీకరిస్తాను. కాని ఇది భ్రమ మాత్రమే."

"సరే. ఆమె ఇంకా ఇంట్లో ఉంటుందనే మీ రనుకుంటున్నారా?"

"ఉండక ఎక్కడికి పోతుంది?" ఆశ్చర్యంగా అన్నాడు.

"చెప్పలేం." నా సంశయం నాది.

"పోతే పోనీయండి. సమస్య తీరిపోతుంది."

"కాని ఇల్లు ఖాళీగా మాత్రమే లేదే?"

"సర్వం పోనీయండి. నాకేం చింతలేదు. కాని ఈ లంపటం వదిలితే అంతే చాలు."

"సరే." ఆఫీసు విడిచి ఇంటికి బయలుదేరాం.

## గ మ ని క

సమీక్షార్థం రెండు ప్రతులు 'ఎడిటర్. ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్. మద్రాసు-2'కు పంపవలసిఉన్నది.

— ఎడిటర్

తలుపులు దగ్గరగానేవేసి ఉన్నాయి. లోపలికి వెళ్ళాం. నడవలో ఆమె లేదు. గదిలోనూ లేదు. నా అనుమానం నిజమైందేమో! అనుకున్నాను. కాని వంటింట్లోకి వెళ్ళాడు కృష్ణమూర్తి. పైకి వచ్చాడు వెంటనే. అతని వెనుకే ఆమె కూడ వచ్చింది. చూశాను: అదిరిపడ్డాను. ఆమె నన్ను చూసింది. చెంగు తలమీదుగా లాక్కుని ముఖం తిప్పుకుని నిలుచుంది. వెనక్కు తిరిగాను. గదిలోకి వచ్చాను. నా వెనుకే అతనూ వచ్చాడు. కుర్చీలో కూలబడ్డాను. అతనూ కూర్చున్నాడు. సిగరెట్ వెలిగించాను. అతనూ వెలిగించాడు.

"ఆమె పేరు రేవతి" అన్నాను.

"ఆఁ!" విస్మయంగా చూశాడు.

"అవును. వారి తండ్రిపేరు గాలిపతి, ఓ రిటైర్డు హెడ్‌మాస్టరు."

"అంటే ఆమె మీకు బాగా తెలుసన్నమాట!" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును. ఒకప్పుడు ఇదే వ్యక్తికోసం అహోరాత్రాలు? అన్వేషణ సలిపాను. కాని అప్పు డది ఫలించలేదు."

"కాని ఆమె మిమ్మల్ని గుర్తుపట్టినట్లు లేదే?"

"లేదు, పట్టలేదు. పట్టదు."

"నాకేం అర్థం గావటంలేదు." అతనికంతా అయోమయంగా ఉంది.

"అవును. అంత తేలిగ్గా అర్థమయ్యే జీవితం కాదామెది."

"అసలు సంగతేమిటో చెప్పండి."

"చెబుతా." చెప్పడానికి సిద్ధపడ్డాను.

"ఉండండి" అని లోపలికి వెళ్ళాడు. రెండు నిమిషాల్లో తిరిగివచ్చాడు. కూర్చున్నాడు.

"వంటింట్లో ఏం చేస్తోంది ఆమె?" అడిగాను.

"కూర్చుంది. పొయ్యిమీద నీళ్ళు మరుగుతున్నట్టున్నాయి" అన్నాడు.

"దేనికి?"

"ఏమో?"

"సరే." సిగరెట్ పారేశాను. మరొకటి వెలిగించాను.

(సశేషం)

# జీవన నిర్ఝరి

ఎ. సర్వేశ్వరరావు

(క్రిందటి సంచిక తరువాయి)

## జరిగిన కథ

శేఖర్, చంచల ఆస్పత్రిలో వెళ్ళుతూ ఉండగా రేవతి పిలిచింది. ఆమె స్థితి దయనీయంగా ఉంది. రేవతి మరణం శేఖర్‌ను కలచివేసింది. చంచలకు ఆమె కథ చెప్పసాగాడు. ఇల్లు విడిచిపోయిన చాలాకాలానికి రేవతి, శేఖర్ మిత్రుడు కృష్ణమూర్తి శరణు కోరింది.

"ఫిఫ్టీసిక్సులో నేను విశాఖపట్నంలో ఉండేవాడిని; ఇదే డిపార్టుమెంటులో క్లార్కుగా పని చేస్తూ. మహారాణిపేటలో ఓ పెద్ద ఇంట్లో ఒక గదిలో నా నివాసం. ఒక దీపావళి రోజున, పొరపాటునో, గ్రహపాటునో అగ్ని కాహుతయిపోయింది నేనున్న ఆ భవంతి. ఆ రాత్రల్లా పెళ్ళే బేడా రోడ్డుమీద వేసుకుని జాగరణ చేయకతప్పలేదు. అప్పుడే, ఆ యింటికి నాలు గిళ్ళవతల ఉంటున్న గౌరీపతిగారితో పరిచయమయింది. మళ్ళీ ఇల్లు దొరికేవరకూ వాళ్ళింట్లో ఉండమని కోరారు. సరే నన్నాను. కాని ఆ ఊరు విడిచిపెట్టేవరకు ఆ యింట్లోనే ఉన్నాను నేను.

"వారిల్లు పెద్దదే. కాని ఉండేది ముగ్గురే. వారు, వారబ్బాయి జయరాం; కోర్టులో పని అతనికి. ఇక కూతురు రేవతి; కాలేజిలో చదువుతోంది."

"అంటే, ఈ అమ్మాయి!" ఆశ్చర్యంగా అడిగాడు కృష్ణమూర్తి.

"ఆఁ ఈ వివరాలు తప్ప ఆ అన్నాచెల్లెళ్ళతో నాకు పరిచయమేంలేదు. అసలా అవసరమేలేదు. తన చదువు, సంగీతం తప్ప మరో ధ్యాసలేదు రేవతికి. ఇక జయరామ్. అతని తత్త్వమే వేరు. గౌరీపతిగారికి పనీ పాటూ లేదు. నేను ఆఫీసు నుండి రాగానే డాబామీదికి పోయి కబుర్లాడుకుంటూనో, చదరంగ మాడుకుంటూనో కాలం గడిపేవాళ్ళం. ఎన్నాళ్ళైనా, ఎంత స్నేహమైనా మా ఇద్దరిమధ్య తప్ప జయరాం, రేవతి నేను కలుసుకున్నదే అరుదు. ఒకనాడు మధ్యాహ్నం మూడు గంటలప్పుడు మా ఆఫీసుకి వచ్చారు గౌరీపతి. ఎందుకో అనుకున్నాను. కాని ఒక సంగతి చెప్పారు. రేవతి కనిపించడంలేదు. ఇల్లు విడిచింది ఉదయం. అంతవరకు చేరుకోలేదు. అయితే దేనికీ ఆందోళన?

నిర్మల, పద్మ, రేవతి స్నేహితురాండ్రు. ఆ ఇద్దరితోతప్ప మర్వెవరితోనూ అటు కాలేజీలో గాని, ఇటు పరిసరాలలోగాని రేవతికి పరిచయమే లేదు. ఉదయం వెడుతూ పద్మ యింటికి వెడుతున్నట్టు చెప్పిందట రేవతి; ఎప్పుడూ అడగని తండ్రి ఆవేళ అడిగేసరికి. పద్మ రేవతి కోసం రెండు గంటలకు వీళ్ళింటికి వచ్చింది. ఒకరింటికి మరొకరు వెళ్ళిఉండవచ్చు. ఒకర్నొకరు కలుసుకోలేకపోవచ్చు. అందులో అనుమానించదగ్గ విషయ మేంలేదు. కాని పద్మ ఉదయంనుండీ ఇంట్లోనే ఉంది. రేవతి ఎప్పుడూ అబద్ధ మాడదు. పొరపాటు చెప్పడానికి మరొకరిప్పుడులేరు. నిర్మల అప్పటికి రెండునెల్ల క్రితమే అత్తవారింటికి వెళ్ళిపోయింది. అందుకే అనుమానించింది పద్మ. దానికి తోడు అనూహ్యంగా ఆమె దృష్టి రేవతి గదిలో పడింది. ఉండవలసిన సామాన్లు కొన్నిలేవు అందులో. దానితో అయోమయమైపోయింది పరిస్థితి.

అందుకే పద్మ నటు పంపి, తానిటు పరుగెత్తుకు వచ్చారు గౌరీపతి. ఇంటికి వెళ్ళాం. చూశాం. ఏదో ఒక అనుమానం లేనప్పుడు అన్వేషణకు అవకాశం ఉండదు. ఏ ఊహ లేకపోయినా ఎన్నో చోట్లు వెదికాం. ఎక్కడా కనిపించలేదు రేవతి. ఏ వివరమూ తెలియలేదు. అయితే సాధారణంగా, స్త్రీ పరారీ అయిందీ అంటే దాని అర్థం ఎవరితోనో లేచిపోవడమే నన్న లోకం వాదు ఒకటుంది. కాని ఆ వాదు సంగీకరించలేం. మేమే కాదు; ఆమె నెరిగున్నవారెవరూ కూడ ఆ అనుమానానికి ఆస్కారమివ్వలేదు. అయితే ఏమైంది రేవతి?

జయరాం అప్పటికి ఊర్లో లేడు. ఆఫీసు పనిమీద బొబ్బిలి వెళ్ళాడు. ఆ రోజు వచ్చాడు. విన్నాడు. అతనిదో వింత తత్త్వం; చాదస్తం జాస్తి. ఆలోచన నాస్తి. జోస్యం చూపించాడు. అంజనాలు వేయించాడు. అవి చెప్పిన ఆచూకీల ఆధారంగా ఎక్కడెక్కడో తిరిగాడు. ఎంతో వ్యర్థపరిచాడు. ఫలితం శూన్యం. అది నాకు తెలుసు. అలాగని వారిని వారించే శక్తి నాకులేదు. నెలలు గడిచినాయి. రేవతి జాడలేదు. కనీసం ఓ అనుమానానికి గాని, ఆలోచనకు గాని ఆధారమే అందలేదు. బెంగతో రోజు రోజుకీ క్రుంగి కృశించి పోసాగేరు గౌరీపతి. వైద్య శాస్త్రానికే అందని రోగమది. మందులకి మానని గాయమది. అయితే చివరి కేమవుతుంది? ఈ పరిస్థితుల్లోనే జయరాంకు చోడవరం ట్రాన్స్ఫరయిపోయింది. తండ్రి, కొడుకు వెళ్ళిపోయారు. నేనుమటుకు అక్కడే ఉండిపోయాను.

స్టేషను ఇన్‌స్పెక్షనుకని సింహాచలం వెళ్ళవలసి వచ్చింది. ఆ రోజు రాత్రి కొండమీద స్వామివారి కల్యాణ మహోత్సవం. పనయిపోయినా ఉత్సవం కోసమై ఆ రాత్రికి ఉంచేశారు. ఉత్సవాలన్నా, జాతరలన్నా నా కెన్నడూ ఉత్సాహంలేదు. స్నేహితులకోసం ఉండిపోవలసివచ్చింది. కాని అదే ఒక అనూహ్య ఫలితాన్నిస్తుందని ఎవరూహించారు?

జనంలో రేవతి కనిపించింది. కాని ఇప్పుడు మీకు కనిపించిన రేవతిగా మాత్రం కాదు.

'ఎవరు మీరు? ఎందుకు నవ్వుతారు? దేనికా విరగబాటు? మీకు తెలియదు. నేను చెప్పినా మీరు వినరు. రువ్వండి. ఇంకా రువ్వండి. రాళ్ళేగా మీరు రువ్వేది! నవ్వులేగా మీరు వెదజల్లేది! వ్యర్థంగా ఈనాడివి పారబోసి, ఒకనాడు వీటికే మీరు అలమటించకపోరు. అది నాకు తెలుసు. తెలిసినా నేను చెప్పను. చెప్పినా మీరు నమ్మరు. నమ్మనివారికి చెప్పి పనిలేదు. నమ్మేవారికి చెప్పే పనే లేదు. అంధులు మీరు. జాత్యంధులు. పో! పొండి! పోరేం?' అరిచింది. రాళ్ళు విసిరింది. గుంపు చెదిరిపోయింది. కాని నేను మిగిలిపోయాను. చూసింది. నన్ను చూసింది. కాని గుర్తు పట్టలేదు. ఇప్పుడూ చూసింది నన్ను. ఇప్పుడూ గుర్తుపట్టలేదు. కాని మన్ననే చేసింది. కాని, అప్పుడు? నన్ను సమీపించింది. గబాలున నా చొక్కా పట్టుకుని ఊపింది; ఉరిమి చూస్తూ

'ఎవరు నువ్? ఏం కావాలి?' అడిగింది.

నాకేం కావాలి? ఎలాటి రేవతి ఎలా అయిపోయింది! నా గుండె తరుక్కుపోయింది. అశ్రుసిక్తములయినాయి నా నయనాలు. రెప్పలు కూడ కదలలేదు. చూస్తూ ఉండిపోయాను. ఆ మూగ చూపు ఆమెకు నచ్చలేదు. అందుకే కోపంగా అడిగింది.

'ఛీ! ఎందుకు వచ్చావ్? రమ్మన్నప్పుడు రాలేవు. పొమ్మన్నప్పుడు పోవు. పిచ్చా నీకు?' అప్పటికీ నేను మాట్లాడలేదు. దానితో మరీ పిచ్చెక్కిపోయింది చెయ్యెత్తి నా చెంపమీద ఛెళ్ళున కొట్టింది—"

"కొట్టిందా?" అదిరిపడ్డాడు కృష్ణమూర్తి.

"ఆఁ. ఒక చెంపమీద కాదు. తన చేతులు నొచ్చేవరకు నా చెంపలు వాయిస్తూనే ఉంది. కాని అప్పటికీ ఎలాటి ప్రతిఘటనా లేకపోగా, ఆశ్చర్యంతో, వ్యథతో పరితపించిపోయింది.




# -ప్రదీప్-

ఆటోమొబైల్ ల్యాంపులు

స్వచ్ఛమైన కాంతికి, చిరకాలం
మన్నికకు, నిర్దుష్టమైన ఫోకసింగ్‌కు
టోషిబా, జపాన్‌వారి సాంకేతిక
సహకారంతో తయారు చేయువారు

ప్రదీప్ లాంప్ వర్క్స్, పాట్నా-9

మద్రాసు ఆఫీసు:
49, జనరల్ పాటర్స్ రోడ్, మద్రాసు-2.
ఫోన్: 86945



# పాదాలలో ఆనెలు

పాదాలలో ఆనెలు, కండలు పెరిగి, వ్రేళ్ళు పాతుకపోయి పాదము నేలపై బెట్టలేక రాళ్ళు తగిలిన (తుళ్ళిపడువారు పైపూతగా వాడినచో (వ్రేళ్ళతో సహా మాయం చేయగల సంజీవి వెల పోస్టు ఖర్చులతో రు. 5-50 న. పై.

కోకోశాస్త్రము చిత్రపటములుగలది రు. 1-50
తెలుగు హిందీ స్వయంశిక్ష రు. 4-50
తెలుగు ఆంగ్ల భాషాబోధిని రు. 5-00

పోస్టు ఖర్చులు ప్రత్యేకము.

ప్రభ అండ్ కో
3, మలయపెరుమాళ్ వీధి, మద్రాసు-1



# *లక్స్ నా చర్మ సౌందర్యంకోసం దివ్యమైన సబ్బు* అన్నది కాంచన




కాంచనకున్నట్లే మీకున్న చర్మసౌందర్యం అమూల్యం...
ఆ సాధనయే దానికి తగినది!

లక్స్ టాయ్‌లెట్ సబ్బు సినీమాతారలకు సౌందర్యమునిచ్చే శుద్ధమైన, సౌమ్యమగు సబ్బు

తెలుపులోను, నాలుగు హరివిల్లు రంగుల్లోను వున్నది

హిందుస్తాన్ లీవర్ ఉత్పత్తి

లింటాస్. LTS. 190-138 TL

'నేను నిన్ను కొట్టాను కదూ? అవును. ఎవరు నన్ను ప్రేమిస్తారో వారినే నేను కొడుతుంటాను. ఎంత పాపిష్టి దాన్ని నేను! అయినా నన్నెందుకు ప్రేమించావు నువ్? వద్దు. వెళ్ళిపో. వెళ్ళిపో! లోకంలో ఎంతో ఉంది.వెళ్ళిపో!' జాలిగా, ప్రేమగా హితవు గరిపింది. చెదిరిపోయిన గుంపు మళ్ళీ పోగవసాగింది. వివిధానుభూతులమయ్యే హాస పరిహాస భావాలు ప్రకృతిలో సుడులు తిరసాగినాయి. సవ్యంగా యత్నించి చూశాను. లాభం లేకపోయింది. ఇక ఇప్పుడు నా మిత్రుల సహాయంతో, కాళ్ళు చేతులు కట్టి జీపులో పడేసి తీసుకువచ్చేశాను. తిన్నగా తీసుకువెళ్ళి హాస్పిటల్లో చేర్చాను. గౌరీపతిగారికి టెలిగ్రాం ఇచ్చాను. వారు వచ్చేవరకు నేను హాస్పిటలుకే వెళ్ళలేదు. వారు వచ్చారు. వివరాలు చెప్పి వారిని పంపించాను. తర్వాతనే నేను వెళ్ళాను.

రేవతి నన్ను చూసింది. గుర్తు పట్టింది. కాని శేఖర్‌గా మాత్రం కాదు. ఆనంద్‌గా."

"ఆనంద్!"

"ఆఁ అప్పుడూ గుర్తించింది. శేఖర్‌గా కాదు. ప్రియుడుగా. కోపించి తన శక్తి చూపింది. చివరికి బాధపడి లాలించింది. కాని ఇప్పుడు? ఏడ్చింది. తనను విడిచిపెట్టి వెళ్ళినందుకు నిందించింది. ఇక విడిచి వెళ్ళనని వాగ్దానం చేయమంది. ఎలా చేస్తాను? ఎవర్ని నేను? కాని చేయక తప్పింది గాదు. కన్నీరు తుడువక తప్పలేదు. కాని ఆ ఆనంద్ ఎవరు? ఎక్కడున్నాడు? రేవతి కథ ఏమిటి? వ్యథ ఏమిటి? అది తెలుసుకోవట మెలా? కేవలం ఆ పేరు మినహా మరో సంగతేదీ ఆమె నోట రావడంలేదు.

ఆనంద్‌ను ఆమె ప్రేమించింది. నమ్మింది. కాని ద్రోహం చేశాడు ఆనంద్. ఇది మేం ఊహించగలిగిన సంగతి. కాని జరిగింది తెలుసుకోడానికి ఇది మాత్రమే చాలదు. లోకంలో ఆనంద్‌లు ఎందరో ఉంటారు. వారిలో మాకు కావలసిన ఆనంద్ ఎవరని? ఎలా వెదికి పట్టుకోడం? నాలుగు నెలలు గడిచినాయి. డాక్టర్ల కృషీ, మందుల ప్రభావం ఎంత ఘనంగా ఉన్నా శారీరకంగానైతే ఆమెకు స్వస్థత చేకూర్చగలిగినాయి. కాని, మానసికంగా ఆమెలో ఎలాటి మార్పునూ తేలేకపోయినాయి. ఈ నాలుగు నెలలూ ఆనంద్‌గానే నేను ఆమె దృష్టిపథంలో నిలిచిపోక తప్పలేదు. కాని ఎన్నాళ్ళిలా? ఎప్పుడో ఒకనాడు ఆ భ్రమ విడిపోక తప్పదు. అప్పు డేమవుతుంది? మధ్య వచ్చిన మార్పు కారణంగా అప్పుడు పరిస్థితి మరింత హైన్యానికి దిగజారిపోవచ్చు. ఆ మార్పుకు కారణమయినట్టే, ఆ తర్వాత జరిగే పరిణామాలకి నేనే బాధ్యుణ్ణి కాకతప్పదు. కాని తమాషా ఏమిటంటే ఎంత ఆనంద్‌గా నన్ను గుర్తించి నాతో మసలుతున్నా మా జీవితాలకి సంబంధించి ఏ ఒక్క విషయం కూడ చెప్పలేకపోతోంది. ఆనంద్ అని పిలిచి మూగగా కళ్ళతో మాట్లాడం తప్పిస్తే మరో అనుబంధమూ లేదు. కాని ఆనంద్‌గా నేను వాగ్దానం చేశాను. అతను ఎక్కడున్నా వెదికి పట్టుకుని ఆ మాట అతని నోట అనిపించే బాధ్యత నామీద ఉంది. ఆమె జీవన లక్ష్యం విధి వశాత్తూ నా చేతుల్లో పడింది. తప్పించుకుందామన్నా అది తప్పదు.

అనుకున్నంతా అయింది. హఠాత్తుగా ఒకనాడు ఆ భ్రమ విడిపోయింది. అపరిచితుల్లో ఒకణ్ణయిపోయాను నేను. ఆనంద్, ఆనంద్ అని ఒకటే కలవరింపు. మా బుర్రలు వేడెక్కిపోతున్నాయి. ఒక దారి కనిపించదు. ఒక తీరు వినిపించదు. ఏం చేయాలి?

రేవతి స్నేహితురాలు నిర్మల. పుట్టింటికి వచ్చింది. అప్పుడు వెళ్ళటమే. ఈమధ్యను యిటు రానేలేదు. ఇక్కడి సంగతులు కూడ సరిగా తెలియవు. పద్మ ద్వారా స్నేహితురాలికి పట్టిన దుస్థితిని తెలుసుకుంది. చూడటానికి వచ్చింది. కాని ఎవర్నీ గుర్తు పట్టటంలేదు రేవతి. ఎవర్ని చూసినా ఆమె అడిగే ప్రశ్న ఒకటే—'ఆనంద్ ఎక్కడ?' అని. ఎవరికి తెలుసు? కాని నిర్మల కొన్ని వివరాలు చెప్పగలిగింది. ఆమె అత్తవారింటికి వెళ్ళటానికో ఇరవై రోజులముందు, ఒక రోజు రేవతి, నిర్మల సినిమాకు వెళ్ళారు. అక్కడో వ్యక్తి కనిపించాడు ఇద్దరూ చూశారతన్ని. అతను కూడ వీరిద్దర్నీ చూశాడు. కాని రేవతియే మాట్లాడింది అతనితో.

'ఎప్పుడు వచ్చారు?'

'నిన్న రాత్రి.'

'ఉంటారా?'

'ఊహుఁ. వెళ్ళిపోవాలి. మళ్ళీ బుధవారం రావలసిఉంది. అప్పుడు పది పదిహేను రోజులుంటాను' అన్నాడతను.

'పోయినసారి ఉంటానని చెప్పి వెళ్ళిపోయారు. మీకోసం మూడుసార్లు వచ్చాము. రాకపోకలకు మాట స్థిరం లేదనుకుంటాను మీకు.'

'సారీ! ఆ రోజు అలా అయిపోయింది. సడన్‌గా వైరు వస్తే వెళ్ళిపోవచ్చింది. వ్యవధి లేదు. అదీగాక కాలేజీకి వద్దామంటే భావ్యంగా ఉండదని జంకాను. ఇంటికివచ్చి చెబుదామంటే మీ ఇంటి అడ్రసు నాకు తెలియదు.'

ఆ తర్వాత చాల విషయాలు మాట్లాడుకున్నారు. ఆ భాష నిర్మల కర్థం కాలేదు. అందుకే అతను వెళ్ళిపోయాక అడిగింది—

'అత నెవరు?' అని.

'మా నాన్నగారి స్నేహితులు.'

'పేరు?'

'తెలియదు.'

'ఊరు?'

'తెలియదు.'

'బాగుంది. ఊరూ పేరూ తెలియకుండానే అంతసేపు మాట్లాడావు?' నిర్మల నమ్మలేకపోయింది.

'ఊరు పేరు తెలియవంతమాత్రాన మాట్లాడకూడదని ఎక్కడా లేదు?'

'అది సరే. ఇదేమిటి, కాలేజీకి వస్తే భావ్యం కాదంటాడు? ఇంటికి రావడానికి అడ్రసు తెలిదంటాడు. మీ నాన్నగారి స్నేహితుడికి మీ యిల్లే తెలియదా?'

'మేం ఇక్కడికి వచ్చినతర్వాత మా యింటికి రాలే దెప్పుడూ. కాకినాడలో ఉండేప్పుడు రోజూ వస్తుండేవాడు...' తర్వాత ప్రసక్తి మార్చి మరో విషయంలోకి మళ్ళించింది. నిర్మల కూడ ఊరుకుంది. తర్కించలేదు. తర్వాత ఆ విషయమే మరిచిపోయింది. బాగానే ఉంది. కాని గౌరీపతిగారు ఒప్పుకోలేదు. ఆనంద్ పేరుగల వ్యక్తి తెవర్నీ ఎరగనన్నారు. అందుకే అనుమానించవలసి వచ్చింది. నిర్మల ఇంకా చెప్పింది. తర్వాత హైదరాబాదులో—నిర్మల భర్త అక్కడే



పుష్కరిణి

ఫోటో — భరద్వాజ (మద్రాసు-18)

ఉంటున్నాడు— ఎగ్జిబిషన్‌లో కనిపించాడట అతను. నిర్మల భర్త అతనితో చాలసేపు మాట్లాడేడు. నిర్మల నతనూ చూశాడు. కాని ఎక్కడో చూసినట్టు కూడ నిర్మల నతను పలుకరించలేదట. అందుకే అతను వెళ్ళిపోయాక భర్త నడిగింది—

'అతను మీ స్నేహితుడా?' అని.

'కాదు. పరిచయం మాత్రమే. అతని పేరు ఆనంద్. ఊరు విజయవాడ. అంతకంటే నాకేం తెలియదు. ఒకసారి ఇద్దరుకలిసి ఒకే కంపార్టుమెంటులో కూర్చుని అయిదు వందల మైళ్ళు ప్రయాణం చేశాం. అదే స్నేహం—' అన్నారట ఆమె భర్త.

ఆ వివరాలు ఆధారంగా రేవతి కథను ఊహించడానికి ప్రయత్నించాను. నిర్మల భర్తను కలుసు

కుని ఇంకా వివరాలు సేకరించి పరిస్థితుల్ని ఒక కొలిక్కి చేర్చి అప్పుడే ఏదో చేయవలసి ఉంది. దానికి గౌరీపతే బయలుదేరతా నన్నారు. కాని ఆ పరిస్థితుల్లో వారు రేవతిని వదిలి వెళ్ళడం సమంజసం కాదు. అదీకాక ఆ వయసులో వారి కా శ్రమా భావ్యం కాదు. ఇక జయరాం. అత నీ పనికి పనికి రాడు. ఇక నేనే ఆ భారం వహించక తప్పలేదు. తన భర్త అడ్రసు ఇచ్చింది నిర్మల. పరిస్థితులన్నీ వివరంగా ఒక ఉత్తరం వ్రాసి ఇచ్చింది. వెళ్ళాను. వారిని కలుసుకున్నాను. అంతా చెప్పాను. వారెంతో విచారించారు. నే నాశించిన వివరా లేవీ చెప్పలేక పోయారు. ఎన్ని మార్లు కలుసుకున్నా, అతని పేరు ఆనంద్ అనీ, ఊరు విజయవాడ అనీ, ఏదో కంపెనీకి రిప్రెజెంటేటివ్ అనీ తప్ప మరో విషయ మేదీ వారికి తెలియదు. కాని ప్రతి నెలా మొదటి వారంలో అతను అక్కడక్కడ కన్పిస్తుంటాడు. అంతవరకు ఉంటే, అతన్ని కలుసుకోవచ్చన్నారు. సరే, ఉన్నాను. ఆగడువు రానేవచ్చింది. కేవలం అతను వీరికి కనిపించే స్థలాలే గాక ఊరు ఊరంతా గాలించినా అతని ఆచూకీ చిక్కలేదు. విసుగెత్తింది. ఇక లాభం లేదని విజయవాడ చేరుకున్నాను. అక్కడ మటుకు నేనేం చేయగలను? పోనీ, చూసి గుర్తు పట్టడానికైనా అతన్ని నేను చూసి ఉంటేగా? అక్కడో రెండు రోజులుండి రిప్రజెంటేటివ్ లెవరేనా ఆనంద్ పేరు గలవారున్నారేమోనని వెతికి వెతికి విసుగెత్తి తిరుగుముఖం పట్టాను.

మోహన్ నా మిత్రుడు. ఇద్దరం ఒకేసారు ఈ డిపార్టుమెంటులో ప్రవేశించాం. ఆ తర్వాత సెలక్షను వచ్చి అతను పోలీసు డిపార్టుమెంటుకు వెళ్ళిపోయాడు. అతని భార్య సుమతి. వాళ్ళన్నయ్య నా స్నేహితుడు. బియ్యేలో నాకు క్లాసుమేటు. తునిలో ఉన్నప్పుడు వాళ్ళింట్లోనే ఉండేవాణ్ణి. ఈ స్నేహంకొద్దీ ఇద్దరూ కలిసి ఎన్నోమార్లు వ్రాశారు నాకు, వాళ్ళూరి కోమారు రమ్మని. అవకాశం లేక వెళ్ళలేకపోయాను. వాళ్ళిప్పుడు

# జీవన నిర్ఝరి

రాజమండ్రిలో ఉంటున్నారు. దారిలోనే కదా, అక్కడ ఆగి రెండు మూడు రోజులుండి పోదామని నిశ్చయించుకున్నాను. కాని అక్కడా చుక్కెదురయింది. వాళ్ళు ఊళ్ళో లేరు. ఎక్కడికి వెళ్ళిందీ, ఎప్పుడు వచ్చేదీ వివరాలు సరిగా తెలియలేదు కూడ. కాని నిర్మల కనిపించిం దక్కడ. నిర్మల భర్త తాలూకు బంధువు లెవరో ఉన్నారక్కడ. నిర్మల అక్కడికి వచ్చి రెండు రోజులైంది. నాలుగైదు రోజుల్లో నిర్మల భర్త అక్కడికే వస్తాడు. ఇద్దరు అక్కడనుండి హైదరాబాదుకు వెళ్ళిపోతారు. అదీ వారి ప్రోగ్రాం.

జరిగిందంతా చెప్పాను. విని చాల విచారించింది. ఆమె భర్త వచ్చేవరకు నన్నక్కడే ఉండమని కోరారు వారి బంధువులు. కాని అంగీకరించలేదు. చివరికి మరీ బలవంతం చేస్తే ఆ ఒక్క రోజూ ఉండటానికి అంగీకరించాను. ఏ పని జరిగినా మంచికో, చెడుకో జరుగుతుంది. కాని వ్యర్థంగా ఏదీ జరుగదు. అదే అయింది. ఆ రాత్రి అందరు సినిమాకు వెళ్ళాం. తిరిగి వచ్చేస్తుంటే జనంలో ఒకర్ని చూపించి, 'అదిగో! అతనే ఆనంద్!' అని చెప్పింది నిర్మల. అతని వెంటబడ్డాను నేను. కలుసుకున్నాను. నే నెవరైందీ చెప్పాను. అత నెవరైందీ తెలుసుకుని అతనే నాకు కావలసిన వ్యక్తి అని నిర్ధారణ చేసుకున్నాను. అతనితో నా కెంత అవసరముందో చెప్పాను. కాని అతను అంగీకరించలేదు. తన పేరు ఆనందే. కాని మాకు కావలసిన ఆనంద్ మాత్రం తను కానన్నాడు. నిర్మల వచ్చింది; చూసింది. గత సంఘటనలు జ్ఞప్తికి తెచ్చింది. అయినా అతను ఒప్పుకోలేదు. రేవతితో పరిచయమయితే ఉంది కాని, దానికో పరిమితి ఉంది. మితిమించి రాగసపడే అవసరం, అవకాశం తనకు లేనేలేవన్నాడు. చెప్పాను. పరిస్థితివంతా చెప్పాను. నాతో ఒక్కసారు రమ్మని వేడుకున్నాను.

అయితే మృత్యువాత పడనున్న ఒక అభాగ్యురాలిని రక్షించినవాడవుతాడు. లేదా తన అమూల్యకాలంలో కొంత మాకోసం వ్యర్థం చేసుకున్నవాడవుతాడు. అంతే. అంతకంటే మరో ప్రమాదమూ, నష్టమూ ఏంలేదు. ఎంతో చెప్పినమీదట అంగీకరించాడు. ఆ మర్నాడు సాయంత్రంగాని తను రావడానికి వీలుపడదన్నాడు. సరే, ఎప్పుడైతే నేం? వస్తే చాలు. కాని మూర్ఖుడు తీరా ఆ గడియ వచ్చేసరికి రాను పొమ్మన్నాడు. నాకు చిర్రెత్తిపోయింది. కాని ఏం చేయగలను? అతన్నేదో విధంగా తీసుకువెళ్ళితీరాలి. కాని దానికో ఆసరా, అధికారం నా కెక్కడ ఉన్నాయి? అదే తరుణంలో మోహన్ కనిపించాడు. పరిస్థితి అంతా అతనితో చెప్పాను. హెచ్చరించాడు మోహన్. రేవతి విషయమై ఇదివరకే మేం పోలీసు రిపోర్టు ఇచ్చిఉన్నాం. అది ఆధారంగా మోహన్ బెదిరించాడు. మర్యాదగా నాతో వెళ్ళకపోతే అధికార లాంఛనాలతో పంపలసివస్తుందని గట్టిగా చెప్పాడు. దానితో ఓ దారికి వచ్చి నాతో రాడాని కంగీకరించాడు ఆనంద్. వెంటనే అతన్ని వెంటబెట్టుకుని బయులుదేరాను.

అనకాపల్లిలో బండెక్కాడు జయరాం. అతనెక్కడికి? విశాఖపట్నంనుండి టెలిగ్రాం వచ్చింది... రేవతి హాస్పిటల్ నుంచి పారిపోయింది. ఆ కంగారులో ఎటో పరుగెడుతూ లారీక్రింద పడి ప్రమాదానికి లోనయ్యారు గౌరీపతి. హాస్పిటలుకు వెళ్ళాం. కాని అక్క డెవరూమిగలలేదు, ఎవరికోసమై నేనంత ప్రయాసపడ్డానో, కనీసం ఆ శ్రమ, స్నేహం గుర్తించడానికైనా ఎవరూ లేరు. ఆనంద్ రాక అంత ఆలస్యం కాకుండా ఉంటే ఇంత ఘోరం జరిగిఉండేది కాదు. కాని విధి నెవరూ తప్పించలేరు. అంతే! ఏమీ లేదిక. ఎవరి అవసరమూ లేదు. జయరాం వెళ్ళిపోయాడు. ఆనందూ వెళ్ళిపోయాడు. నేను మిగిలిపోయాను. కాని ఎన్నాళ్ళో కాదు. తర్వాతిలారు ట్రాన్సుఫరయి నేనూ ఆ ఊరు విడిచి పెట్టేశాను."

"అంతేనా?" అడిగాడు కృష్ణమూర్తి. అతని ముఖం చెమటతో తడిసిపోయింది.

"ఊహుఁ. ఇంకా ఉంది" అన్నాను. గది గుమ్మంలో చప్పుడైంది. అటు చూశాము. రేవతి వస్తోంది. ఆమె చేతిలో ఒక పళ్ళెం ఉంది. దానిలో రెండు టీ కప్పులు. మెల్లగావచ్చి నా చెంత నిలుచుంది. ఒక కప్పు తీసుకున్నాను. కృష్ణమూర్తి వచ్చి తనొకటి తీసుకున్నాడు. ఆమె వెళ్ళిపోయింది.

"ఈ ఏర్పాట్లన్నీ ఆమె కెవరు బోధించారు?" కుతూహలంగా అడిగాను.

కృష్ణమూర్తి కలవరపడి "నేను చెప్పలేదు" అన్నాడు.

మందహాసం చేశాను. "మరెందుకు చేసినట్టు?"

"ఏమో?"

నవ్వాను. "బహుశా మీ ఆంతర్యం అర్థం చేసుకునుంటుంది" అన్నాను, క్రీగంట వరండాలోకి చూసి.

రమణీయ ప్రకృతి ఫోటో—ఆర్. ఎ. జంసందేకర్ (బొంబాయి-12)




"అంటే?" సందేహంగా అడిగాడు.

"ఏంలేదు!" సిగరెట్ వెలిగించాను.

"కాలంలో ఎన్నో మార్పులు వచ్చినాయి. పరిస్థితులూ అటు యిటుగా మారుతూ, చేరుతూ దాటిపోతున్నాయి. వాటి ననుసరించి జీవితమూ సాగిపోతూంది ప్రశాంతంగానో, అశాంతిగానో. కాని స్మృతులన్నవి ఏ మార్పూ, చేర్పూ లేక ఎప్పుడూ ఒకే తీరున మనసుల్ని కదిలిస్తూంటాయి. ఒకనాడు నిర్మల దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. అడ్రసు మారిన కారణంగా వ్రాసిన రెండు వారాలకి నాకు చేరింది. విజయవాడ స్టేషనులో రేవతి కనిపించిందట వారికి. మెరుపులా ఇట్టే దృష్టినిపడి అట్టే అదృశ్యమైపోయిందట. ఆమె ఒక్కతే ప్రయాణం చేస్తూందట అప్పుడు. తోడెవరూ లేరట. ఆ కారణంగా రేవతికై వెదకలేకపోయిందట. తోడు లేకపోయినా వ్యవధి అన్నా ఉంటే వెదికి ఉండేదట, ఎంత శ్రమపడైనాసరే. కాని ఆమెకు వ్యవధే లేకపోయిందట. వెంటనే బయలుదేరి వెళ్ళాను. విజయవాడంతా గాలించాను. కాని ఫలితం శూన్యం. నిరాశగా వెనక్కి వచ్చేశాను. అయితే ఒక సంగతి తెలిసింది. అలాటి పోలికలున్న వ్యక్తి రెండు వారాల క్రిందట విజయవాడ వీధుల్లో తిరగ్గా చూసినట్టు కొందరు చెప్పగా వినగలిగాను. కాని ఇప్పు డెక్కడుందో? కాని ఒకనాడు అకస్మాత్తుగా, నేనున్న ఊర్లోనే ఎలాటి ప్రయత్నమూ చేయకుండానే కనిపించింది ఒక దేవాలయంముందు అతి హీనస్థితిలో. ఒంటి నిండా గాయాలు. ఎవరో చెప్పారు. ఆమె పిచ్చిది. రెండు రోజులుగా ఊర్లో తిరుగుతూ ఉంది. పిల్లలు వెంట బడుతున్నారు. రాళ్ళు రువ్వుతున్నారు. నవ్వుతున్నారు. ఆనందిస్తున్నారు. అయినా ఆమె ఏం అనలేదు. ఎప్పుడైతే ప్రతిఘటన ఉండదో అప్పుడే హింస ప్రకృతి మరింత మీరిపోతుంది. దయామయుని మందిరం ముందేనా ఈ అమానుష ప్రవృత్తి? దానిని మందలించేవారే లేకపోయారా? జగద్రక్షకుని కళ్ళముందేనా ఇంత దారుణం? చూసిన ఏకన్నూ, ఇంత కన్నీరు చిలికించి, జాలి చూపలేకపోయిందా?

తీసుకువచ్చాను. డాక్టరును పిలుచుకువచ్చి గాయాలకు కట్లు కట్టించాను. మందులు ఇప్పించాను. ఒకప్పుడు ఆమె మానసికంగా దుర్బల. కాని శారీరకంగా సబలే. కాని ఈనాడు శరీరంలోనూ ఏ శక్తీ లేదు. కాని తెలివివచ్చి నాతో మాట్లాడిన తర్వాత ఒక విషయం గుర్తించగలిగాను. అప్పటికి మానసికంగా ఆమెకే రుగ్మతాలేదు. కేవలం శరీరానికి మాత్రమే మిగిలిపోయిందది. ఎంతో సంతోషించాను. కాని, కన్నుతెరిచి నన్ను చూస్తూనే ఆమె అడిగిన మొదటి మాట—"నాన్నగారు ఎక్కడున్నారు? ఎలా ఉన్నారు?" అని. జవాబు చెప్పలేకపోయాను. ఆశించని, ఊహించని మార్పును నే నప్పుడు ఆమెలో చూడగలిగాను. అది నా జవాబుతో మళ్ళీ ఎలాటి స్థితికి దిగజారిపోతుందో అన్న భయంతో చెప్పలేకపోయాను.



చేపల వేటకు సన్నాహం

చిత్రం—రాజు (మద్రాసు)

"నీకేం భయంలేదు. అందరూ ఉన్నారు. కాని ఆ కంతల నేవీ నీ మనసులో ఇప్పుడు పెట్టుకుని బాధపడవద్దు. ముందు నీ ఆరోగ్యం ఒక దారికి వస్తే అప్పుడే" అంటున్నాను.

శుష్కహాసం చేసింది. "నా జీవితం గురించి నే నెప్పుడూ భయపడలేదు, శేఖర్‌గారూ! అంతా గడిచిపోయింది. అన్నీ విడిచిపోయినాయి. స్మృతి మాత్రంగా కూడ నా కేదీ దక్కలేదు."

అప్పుడే తన కథంతా చెప్పింది. దానికీ మేం ఊహించినదానికీ అణుమాత్రం కూడ సంబంధం లేదు. ఆనంద్‌పట్ల నాకున్న భ్రమ వీడిపోయింది. అయితే అసలు ఆనంద్‌ను తీసుకురావడానికి గాని, ఆమె జీవితానికై ఏది చేయడానికి గాని నా సంసిద్ధతను వెల్లడించాను. కాని ఆమె అంగీకరించలేదు. అవన్నీ ఏనాడో త్యజించిందట. విస్మరించిందట. జీవితాని కిక ఎవరి ప్రసక్తీ అక్కరలేదు అని ఏవేవో చెప్పింది. కాని మనం అక్కరలేదన్న మాత్రాన ఆ అక్కరలు మనల్నంత తేలిగ్గా విడిచిపెట్టవు. విడిచిపెట్టామనుకుని నిబ్బరపడ్డా ఏదో సమయంలో వాటి ప్రభావం మనపై పడకమానదు. ఆలోచించి ఆలోచించి నేనో సూచన చేశాను. దానికి అంగీకారం గాని, అనంగీకారం గాని ఏలాటి భావమూ ప్రకటించలేదు. మౌనంగా ఉండిపోయింది. కాని ఆ మౌనం మౌనంగా ఉండిపోయింది. కాని ఆ మౌనంలో అనంత యోచనల ప్రగాఢ ముద్ర దాగిఉందన్న విషయం నే నప్పుడు గ్రహించలేకపోయాను. రేయి గడిచింది. ఎన్నో ఆలోచనలతో తెల్లవారింది. కాని నే నూహించినరీతిగా మారలేదు. నిన్నటి ఉదయానికీ నేటి ఉదయానికీ ఏ తేడాలేదు. నిన్న ఉషస్సుకు బిక్కు బిక్కుమంటూ ఇల్లంతటికీ ఒక్కణ్ణే ఎలా ఉన్నానో నేడూ అలానే ఉన్నాను. రేవతి ఎక్కడికి వెళ్ళిపోయింది? ఎప్పుడు వెళ్ళిపోయింది? రాత్రంతా నేను నిద్రపోనేలేదు. మరి ఎప్పుడు కన్ను మూసేనో, ఆ అవకాశాన్ని ఆమె ఎంత తెలివిగా వినియోగించుకుందో అదే అర్థంగాలేదు. నా స్థితినీ, గతినీ మరిచి ఆమెకై అడుగడుగూ వెదకి వేసారి పిచ్చెత్తిపోయాను. కాని ఆమె జాడలేదు. అంతే! ఆనాటి రేవతి ఈనాడు ఈ విధంగా ఇక్కడ కనిపించింది" అని ముగించాను.

నిట్టూర్పు విడిచాడు కృష్ణమూర్తి. పచార్లు చేయసాగేడు గంభీరంగా.

"అయితే ఇప్పుడేం చేయాలి?" అన్నదే ప్రశ్న.

జయరాంకి ఉత్తరం వ్రాశాం. వచ్చాడు. చూశాడు. కాని రేవతి దృష్టిపథంలో అందరూ చెరిగిపోయారు. కృష్ణమూర్తి ఒక్కడే ఆనంద్‌గా అంతే. ఆనాడు నేను విన్న వివరాలు ఆధారంగా అసలైన ఆనంద్‌కై జయరాంనీ, కృష్ణమూర్తినీ పంపించాను. పది రోజుల్లో ఆనంద్‌తో తిరిగి వచ్చారు. కాని స్థితే తారుమారయిపోయింది. రేవతి అతన్నీ గుర్తించలేదు. ఇక ఏం చేయాలి? రోజులు గడుస్తున్నాయి. సమస్యకో పరిష్కార మార్గం గోచరం కావడంలేదు. చివరికి కృష్ణమూర్తి, జయరాం ఆలోచించి నిర్ణయానికి వచ్చారు. తప్పదనో, త్యాగమనో ఆ నిర్ణయానికి రాగలిగాడు కృష్ణమూర్తి. తత్ఫలితంగా ఓ రోజు, జయరాం నేనూ సాక్షులుగా, భగవంతుని సన్నిధిలో రేవతిని అర్ధాంగిగా స్వీకరించాడు. నేనా యిల్లు విడిచిపెట్టక తప్పలేదు. ఇల్లు మారాను. కాని పది రోజుల అనంతరం ఊరే మారక తప్పలేదు. రాజమండ్రి వచ్చేశాను.

వారాని కొకటి చొప్పున కృష్ణమూర్తి ఉత్తరాలు వ్రాస్తుండేవాడు. తన భర్త స్నేహితుడు శేఖర్ చాల మంచివాడు అన్న అభిమానంతో ఆ ఉత్తరాలలో తన శుభాకాంక్షలు కూడ తెలుపుతుండేది. ఆమె ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. ఎలాటి అస్వస్థతా ఆమె నిక చేరలేదు. జీవితానికో లక్ష్యం, గమ్యం ఏర్పడ్డాయి. సంతోషించాను. కృష్ణమూర్తి వ్రాశాడు, రేవతి గర్భవతి అయిందని. మరింత సంతోషించాను, కృష్ణమూర్తి జీవితమూ సుఖవంతమయింది గదా అని. కాని ఆ సంతోషం ఎన్నాళ్ళో నిలవలేదు. ఒకనాడు టెలిగ్రాం వచ్చింది అతన్నుండి—పరిస్థితులు చాల విషమ స్థితిలో ఉన్నాయి, బయలుదేరి రమ్మని. వెళ్ళాను. చెప్పాడు. రేవతి కప్పుడు ఆరో నెల. ఒకనాడు దాబా మెట్లు దిగుతూ కాలు జారి పడిపోయింది. హాస్పిటలుకు తీసుకువెళ్ళాడు. ఎబార్షనయిపోయింది. తర్వాత రేవతిని హాస్పిటలు నుండి తీసుకువచ్చేశాడు. కాని రేవతి స్థితి మళ్ళీ

మెక్లీన్స్ టూత్‌పేస్ట్ యొక్క తాజాదైన, ఆశ్చర్యకరమైన రుచి అది యీ క్రింది విధముగా పనిచేస్తోందనుటకు నిదర్శనము!

**శుభ్రపరుస్తుంది** — పళ్లమీది పసుపుపచ్చని పొరను తీసివేస్తుంది

**తెల్లగాచేస్తుంది** — పళ్లను ఎక్కువ తెల్లగా చేస్తుంది

**రక్షణకలిగిస్తుంది** — కుళ్లేలా చేసే సూక్ష్మక్రిములను తొలగిస్తుంది. మీ నోటిని సువాసనతో శుభ్రముగా ఉంచుతుంది.




మెక్లీన్స్ - మెరిసే తెల్లని పళ్లకు

MTP/1/P/1/65 TL

# జీవన నిర్ఝరి

గత స్మృతుల్లోకి జారిపోతున్నట్లు అనుమా నించాడు. కాని అది కేవలం అనుమానంమాత్రమే. మరీ జాగ్రత్తగా ఉండలేకపోయాడు. ఒకనాడు ఆఫీసునుండి ఇంటికి వచ్చాడు. ఇల్లు శూన్యంగా ఉంది. ఎవరు ఎక్కడ ఉండాలో వారక్కడ లేక పోతే సర్వం శూన్యమే అయిపోతుంది. అదే జరి గింది. రేవతి లేదు. ఎక్కడికి వెళ్ళిపోయింది? ఎలా వెళ్ళగలిగింది? వెతికాడు. అప్పుడే నాకు టెలిగ్రాం ఇచ్చాడు.

ఒకనాడు లేదు రేవతి. నేడూ లేదు. కాని ఈమధ్య కాలంలో ఆమె ఉనికి పెంపుచేసిన రాగ చ్ఛాయలే నాటికీ అంతరించిపోలేవు. ఆ ప్రేమ మయ మధురస్మృతి ఏనాటికీ మాసిపోదు. అతని ఆ ఇరవై ఏడేళ్ళ జీవితమూ ఒక ఎత్తు. రేవతి సాహచర్యంలో గడిచిన ఆ ఏడు నెలల జీవి తమూ ఒక ఎత్తు. మనిషి దూరమైనా, మనసు భారమైనా, మమత మాసిపోదు. స్మృతి చెరిగి పోదు; కన్నీట కరిగిపోదు. ఆ హత భాగుని దుఃఖానికి ఎవరూ విలువ కట్టలేరు. నేనూ ప్రత్యేకంగా చింతించలేకపోయాను. ఏమంటే మరీ ఇంత యిదిగా కాకపోయినా ఇలా జరుగుతుం దేమోనన్న సంశయమూ, భయమూ నాకుండనే ఉన్నాయి.

అతని కర్మ కతన్ని విడిచిపెట్టి నేను వచ్చే శాను. కొన్నాళ్ళు అతని దగ్గర్నుండి ఉత్తరాలు వస్తుండేవి. తర్వాత అవీ లేవు. ఇప్పుడు ఎక్కడ ఉన్నాడో, ఎలా ఉన్నాడో, అసలు ఉన్నాడో లేడో అదీ తెలియదు. రెండేళ్ళక్రితం జయరాంను కలుసుకున్నప్పుడూ, ఎనిమిది నెలలక్రితం నిర్మ లను కలుసుకున్నప్పుడూ ఆ ప్రసక్తి వచ్చింది. అంతే.''

నిట్టూర్పు విడిచింది చంచల.

"ఆనాటి రేవతి ఈనాడు ఈ విధంగా ఇక్కడ నన్ను గుర్తించింది. కాని ఇప్పుడూ పారి పోయింది. ఇదివరకు పారిపోతే మళ్ళీ ఎప్పుడో ఎక్కడో కన్పిస్తుందన్న ఆశ ఉండేది. కాని ఇప్పు డదీ లేదు. కాని ఒకటి. ఒకనాడు ఆమె అడిగిన ప్రశ్నకు నేను జవాబు చెప్పిఉంటే ఆమె రాక ఇంత ఆలస్యమై ఉండేది కాదు. కృష్ణమూర్తి ప్రసక్తి, తర్వాత పరిస్థితి, వీటితో నిమిత్తమే ఉండేది కాదు.

బహుశా ఆ లోకంలో తండ్రి కంటబడి నప్పుడు అనుకుంటుంది— శేఖర్ నన్ను మోసం చేశాడు. లేకుంటే నా రాక ఇంత ఆలస్యమై ఉండేది కాదు. ఏనాడో వచ్చి మిమ్మల్ని చేరుకుని ఉండేదాన్ని. ఇంతమందిని దుఃఖపెట్టి నాపాప భారాన్ని పంచుకునీ ఉండేదాన్ని కాను!''

లేచి కిటికీ దగ్గరకు నడిచాడు. కిటికీ తలు పులు తెరిచాడు. వాన ఎప్పుడో వెలిసిపోయింది. కాని చీకటి చిక్కగా అలుముకుంటూంది. ★